# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- బోధనలు చేసిన ఆయా చర్చిల పాస్టర్లు


తాండూరు: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


మోమిన్‌పేట: చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 25: క్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజక వర్గాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తాండూరు మెథడిస్ట్ చర్చి, శివాజీచౌక్, ఇంద్రానగర్‌లోని హెబ్రోన్‌చర్చిల్లో, సెయింట్ మార్క్స్ చర్చి, సాయిపూరు కింగంసాలెం చర్చి, రాజీవ్‌గృహకల్పలోని నజరేతు చర్చిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసు ప్రభును స్మృతిస్తు భక్తులు ఆలాపించిన దైవ భక్తి గీతాలు, కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల సీనియర్ నేతలు చర్చిలకు వెళ్లి కేక్ కట్‌చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి రూపంలో దేవుడు భూమిపై అవతరించిన రోజునే క్రైస్తవులు క్రిస్మస్ పండుగా జరుపుకుంటారని పేర్కొన్నారు. వికారాబాద్ మెథడిస్ట్ చర్చిలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ వేడుకలలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు రమేష్‌కుమార్, చర్చి పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. పరిగి పట్టణంలోని స్ముర్న ఫెయిత్ సెంట్రల్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పాస్టర్ బిషప్ ఏసుదాసు–జాస్మిన్ దంపతులను సన్మానించారు.


పరిగి: కేక్ కట్ చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్


కొడంగల్ మెథడిస్ట్ చర్చిలో..

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు

బొంరాస్‌పేట, డిసెంబర్ 25 : క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం మండలంలో క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మెట్లకుంట, రేగడిమైలారం, బొంరాస్‌పేట, తంకిమెట్ల గ్రామాలలోని చర్చిలను విద్యుత్ దీపాలు, రంగు రంగుల కాగితాలతో అందంగా అలంకరించారు. ప్రార్థనా మందిరాలు, ఇండ్ల పైన విద్యుత్ వెలుగులతో కూడిన నక్షత్రాలను ఉంచారు. పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు ప్రపంచానికి చాటి చెప్పిన ప్రేమ, శాంతి సందేశాలను ప్రజలు అనుసరించాలని పాస్టర్లు సూచించారు. యేసుక్రీస్తు జననం గురించి వివరించారు. మెట్లకుంట గ్రామంలో సాయంత్రం జరిగిన ఆటల పోటీలలో క్రైస్తవ సోదరులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. రాత్రి చర్చిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు క్రిస్మస్ తాతయ్య వేషధారణలు వేసి అలరించారు. క్రిస్మస్ తాతయ్యలతో చిన్న పిల్లలు ఉత్సాహంగా గడిపారు. ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.


కండ్లకు గంతలు కట్టుకుని కుండలు పగులగొడుతున్న మహిళ


పెద్దేముల్ : మెథడిస్ట్ చర్చిలో జరిగిన వేడుకలకు హాజరైన క్రైస్తవులు

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్, డిసెంబరు 25: జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఏనుగొండ, కొడంగల్ లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కొడంగల్ లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాల సమస్య ఉన్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. క్యాంపులో పాల్గొనే వారు ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఫోన్ నెంబర్ కలిగి ఉండాలని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

## ప్రతిపైసాను సద్వినియోగం చేసుకుంటాం


ఐమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

దోమ, డిసెంబర్ 25: ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రతిపైసాను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఎర్రగోవిద్ తండాలో ఎంపీపి నిధుల నుంచి మంజూరైన రూ. నాలుగు లక్షల నిధులతో వేసిన సీసీ రోడ్డును, రూ.రెండు లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను ఎంపీపి సత్యహరిశ్చంద్రతో కలిసి జడ్పీటీసీ రాందాస్ సోమవారం ప్రారంభించారు.

## దుద్యాల మండలాన్ని వికారాబాద్‌లోనే కొనసాగించాలి

బొంరాస్‌పేట, డిసెంబర్ 25 : దుద్యాల మండలాన్ని వికారాబాద్ జిల్లాలోనే కొనసాగించాలని మండలానికి చెందిన నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లేఖను సోమవారం సర్పంచ్ మహ్మద్ ఖాజాకు అందజేశారు. వికారాబాద్ జిల్లా చార్మినార్ జోన్‌లో ఉండడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో కలపాలన్న ఆలోచనను విరమించుకోవాలని నిరుద్యోగులు ఆ లేఖలో కోరారు.


లేఖను సర్పంచ్‌కు అందజేస్తున్న నిరుద్యోగులు

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పరిగి, డిసెంబర్ 25: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకొని పూజలు చేశారు.

## వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


పల్లకీ సేవలో స్వాముల కోలాహలం

తాండూరు, డిసెంబర్ 25: పాత తాండూరు వేంకటేశ్వర దేవాలయంలో సోమవారం మణికంఠ ఆశ్రమం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. స్వామియే... శరణమయ్యప్ప ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాములు, భక్తులు ద్వీపారాధన, పుష్పార్చనలు, పేటతుళ్లై నృత్యాలు, భజనలు, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా చేశారు. స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పాటు స్థానిక నేతలు, భక్తులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

## కొడంగల్‌ను చార్మినార్ జోన్‌లోనే కొనసాగించాలి


అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న జేఏసీ నాయకులు

కొడంగల్, డిసెంబర్ 25: కొడంగల్‌ను చార్మినార్ జోన్‌లో కొనసాగిస్తూ.. జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కొడంగల్ జేఏసీ నాయకులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు బస్సప్ప, మడిగె శ్రీనివాస్, బుస్స చంద్రయ్య, రమేశ్‌బాబు, బీంరాజ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్‌ను మహబూబ్‌నగర్ జిల్లాలోకి మార్చనున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఒకవేళ అలా జరిగితే జోగులాంబ జోన్‌లో చేరాల్సి వస్తుందన్నారు. జోగులాంబ జోన్‌లో ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా పేర్కొన్నారు చార్మినార్ జోన్‌లో ఉండటం వల్ల హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతంలో చదువుకున్న వారు అత్యధికంగా ఐటీ రంగంలో కొనసాగుతుంటారని కొడంగల్ లాంటి వెనుకబడ్డ ప్రాంతాల వారికి ఎక్కువగ ఉద్యోగ అవకాశాలు పొందే ఆస్కారం ఉంటుందన్నారు. కొడంగల్ నియోజకరవ్గంలో అదనంగా మండలాల సంఖ్యను పెంచి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తప్ప, బలరాం, చంద్రశేఖర్, హనుమంతు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కొడంగల్, డిసెంబర్ 25: పట్టణానికి చెందిన కిరణ్ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. హైద రాబాద్ లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందు తున్న కిరణ్ సోమవారం కామారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. అదేవిధంగా బీహార్ రాష్టంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పాన సాయిరెడ్డి తెలిపారు. కిరణ్, కోచ్ సాయిరెడ్డిలను జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రారెడ్డి, కార్యదర్శి గోపీలతో పాటు స్థానికులు అభినందనలు తెలిపారు.